# పాప సంసారం

పసిపిల్లల ఆటలు, వాళ్లుచేసే చేష్టలు, మాటలు ఎంతో ముద్దుగా ఉంటాయి. వాళ్ళకోరికలు విచిత్రముగా ఉంటాయి. తాము పెద్దవాళ్లై పిల్లలమీద అధికారం వహించాలని ప్రయత్నిస్తుంటారు. తామే అమ్మ, నాన్న అయిపోయినట్లుగా భావించి పిల్లల్ని సంరక్షిస్తున్నట్లు బొమ్మలతో ఆడుకుంటారు. వాళ్ళుచేసే ప్రతిపనీ పెద్దలను అనుకరించి చేస్తారు.

ఒకరోజు నేను పత్రిక చదువుతూ హాల్లో కూర్చున్నాను. "కమలా! అన్నము చల్లారి పోతోంది. వేగంతిను. పప్పు కలుపుకో నెయ్యి వేస్తాను. అన్నము క్రింద పొయ్యకు. తప్పుగదూ?"

హాల్లో ఎవరికి పాప అన్నముపెట్టేది? అని ఆశ్చర్యముతో ఆవైపు చూచాను. మా అక్కయ్య కూతురు నాలుగేళ్లపాప, ఆడుకుంటోంది. ఇందుకేనా! ప్రొద్దుటి నుంచి అమ్మని చీరకట్టమని పోరుపెట్టింది! మేమే చీరకట్టుకోలేక అవస్థపడుతుంటే, పెట్టెడున్నాయో లేదో, అప్పుడే నీకు చీర లేమిటే' అని అక్కయ్య గసిరికొట్టింది. అది ఏడుపు లంకించుకుంది. నేను గబగబా ఒకపాతచీర తెచ్చి, మధ్యకి మడిచికట్టగానే సంబరముతో ఎగిరి గంతేసింది.

ఒకమూలకి రెండు పెక్కలుపెట్టి ఒకగది లాగా చేసింది. పొయ్యి, పొయ్యిలోకి పుల్లలు, గిన్నెలు సమస్తము ఎప్పుడు సిద్ధపరచిందో గమనించలేక పోయాను. 'కమల' అంటే పాపకూతురులా వుంది. కమలకి వడ్డించి తను భోంచేస్తోంది. ఇంతలో ఉయ్యాల్లో పాపాయి లేచింది కాబోలు,

'కమలా! నీవు విమలదగ్గరకెళ్లి ఆడించు' నేను కంచాలు కడిగివస్తాను.'

"విమలని అలా కొట్టేస్తున్నావేమే? ముద్దుపిల్ల. నా చిన్ని పాపాయి, ఏడవకమ్మా ఏడవకు, ఏడిస్తే బూచివాడు తీసుకెళ్తాడు. నీకు బొమ్మలు, బిస్కత్తులు కొనిస్తాగా. ఏయ్! కమలా!! ఇదిగో పుస్తకాలు, పలక తిసుకుని బడికివెళ్లు. నీకు పైసకావాలా? ఏడిస్తేకాని ఇవ్వను వెళ్లు"

'నీకు ఆకలేస్తోందా పాపాయి. ఇందా పాలుతాగమ్మా మనింటికి చుట్టాలు వస్తారు. మనము సినిమా చూస్తాము. బొమ్మలు కొంటాము ఏం!'

'ఏమండి! బాగున్నారా? రండి, ఈ చాపమీద కూర్చోండి.'

'నాకు యిద్దరుపిల్లలు, కమల, విమల కమల నాలుగవ కలాసు చదువుతోంది. బడికి వెళ్లింది... ఇది మా అవ్వ నెలకి అయిదురూపాయి లిస్తాము' అని వచ్చిన బంధువులతో చెప్తోంది తిప్పుకుంటూ.

ఆ అవ్వకి ఒక మాసిన చీర, పెద్ద కొప్పు వేసి అచ్చం పనిమనిషిలాగ చేసింది. మా పాపకి ఇంత తెలివి, ఇన్ని ఆలోచనలు, వాటిని ఆచరణలో పెట్టగల శక్తి ఉందని నేనెప్పుడూ ఊహించలేదు.

కుర్చీచేతికి ఒక గుడ్డను ఉయ్యాల్లాకట్టి దానిలో చిన్న బొమ్మను పడుకుండబెట్టి ఊపుతూ, వచ్చిన చుట్టాలతో మాట్లాడుతూంటే ఈ సంసార లక్షణములు ఎట్లా అబ్బాయోయని నేను ఆశ్చర్యపోయాను. నేను పుస్తకము చదువుతున్నట్టే నటిస్తూ దాన్ని పరిశీలించటము అది గమనించలేదు. అదీ గాక, పాప సంసారం గొడవలోపడి హాల్లో ఒక మనిషి ఉన్నదన్న సంగతి మర్చిపోయింది. లేకపోతే దాని చి సంసారం చూడలేక పోదునేమో?

సినిమా చూడ్డానికి వెళ్తున్న అమ్మతో, తనూ సినిమాకి వస్తానని మారాం చేస్తుంది "కాబోలు కమలని సముదాయిస్తోంది" అమ్మ.

"ఛా! నేను సినిమాకి వెళ్లటం లేదు. నాకు జ్వరము వచ్చిందని డాక్టరు దగ్గర కెళుతున్నాను. నీవు డాక్టరు దగ్గరికి వస్తే సూది గుచ్చుతారు తెలుసా? మంచి దానివి గదూ? ఇందా ఈ కాణీ తీసుకు పప్పులు కొనుక్కో. మాకమల చాలా మంచిది...

పాప బుజ్జగించే ధోరణి చూచి నవ్వాపుకోలేక పోయాను. ఎవరో చెంప చరచినట్లయ్యింది. పెద్దలుచేసే మోసము, పసిపిల్లలు పసిగట్టి, బుద్ధి చెప్పే ధోరణిలో నటిస్తూ ఉంటే నా మనస్సు చివుక్కుమంది.

నేను, అక్కయ్య సినిమాకి వెళ్తూ, డాక్టరు దగ్గరకి అని వంక పెట్టి దాన్ని ఇంట్లో వదిలేసి వెళ్లేవాళ్లము. డాక్టరు పేరుచెప్తే మాపాపకి భలే భయం. ఒకసారి పాపకి తేలుకుట్టి, బాధకి తల్లడిల్లిపోతుంటే డాక్టరు దగ్గరికి తీసుకెళ్లి ఇంజక్షన్ చేయించాము. అవంక చెప్తే చచ్చినా రాననేది. దాని చిన్ని బుర్ర మేము చేసే మోసం గ్రహించి ఎదురుగా నటించి చూపుతూవుంటే ఎగతాళి చేసినట్టు బాధపడ్డాను. ఒక్కసారి పాపని తనివితీరా కౌగలించుకుని క్షమాపణ వేడాలనుకున్నాను. బాలలు బ్రహ్మ స్వరూపులు గదూ?

కాని నేను నవ్వినప్పుడు నేనక్కడున్నానని గమనించి ప్రక్కగదిలోకి పారిపోయింది.

★

కనకపల్లి రాధ.

